క్లుప్తంగా

నేడు అవధూత మండల ఆరాధన

రాజంపేట టౌన్ : పట్టణ శివారుల్లోని కూచివారిపల్లెలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద గురువారం ఉదయం 8 గంటల నుంచి అవధూత (జడల స్వామి) ఆరాధన పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు బుధవారం విలేకరులకు తెలిపారు. అందులో భాగంగా గురుపరంపర సాంప్రదాయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాలకు చెందిన స్వామివారి భక్తులు, సాధువులు మండల ఆరాధన పూజల్లో పాల్గొంటారన్నారు. సత్సంగపారాయణ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

క్రీడావిజేతలు అన్ని రంగాల్లో రాణిస్తారు

రాయచోటి అర్బన్ : క్రీడలలో విజేతలుగా నిలిచే విద్యార్థులు మిగిలిన అన్ని రంగాల్లోనూ రాణించగలుగుతారని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు ప్రసాద్‌బాబు అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లాస్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రాలను ఆయన ఏఐఎస్ఎఫ్ నేతలతో కలిసి విడుదల చేశారు.

చేనేత కార్మికులకు సన్మానం

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో బుధవారం చేనేత కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు జనసేన నాయకుడు రాటాల రామయ్య చెప్పారు. 10వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు చేనేత కార్మికులను సన్మానించినట్లు తెలియజేశారు.

ఉద్యమంలా చెట్లు నాటుదాం

రాజంపేట : చెట్లు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని ఏఐటీఎస్ ప్రిన్సిపల్ డా.నారాయణ అన్నారు. బుధవారం అన్నమాచార్య యూనివర్సిటీ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో బోయనపల్లె పరిసర ప్రాంతాల్లో ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంపకం వల్ల పర్యావరణ పరిరక్షణ లభిస్తుందన్నారు. గంగిరెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపవరం రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్‌సీసీలో చేరాలన్నారు.

జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

రాయచోటి అర్బన్ : సెప్టెంబరు 1,2,3 తేదీలలో విశాఖపట్నంలో 3 రోజులపాటు నిర్వహింపబడే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనంను విజయవంతం చేద్దామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నేతలు నాగరాజు, మురళి, కేశవరావు, విశ్వనాథనాయక్, మండెం సుధీర్‌కుమార్, రామాంజనేయులు, భాస్కర్, పవన్ పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

రాజంపేట : బదిలీ విధానంలో పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహించిన 15 మంది కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీఓ హోం వద్ద బుధవారం మున్సిపాలిటీ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలను ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్మికుల పొట్టకొట్టడం సమంజసం కాదన్నారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఈ మల్లేలష్‌ను కలిసి సమస్యను విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కార్మికుల వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, డి.లక్ష్మీదేవి, కె.ప్రసాద్, వెంకటరమణ, ఎల్లయ్య, నరసింహులు, కోనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను గుర్తించండి

ఒంటిమిట్ట : మండలానికి విడుదలైన రూ. 20 లక్షల ఉపాధి పనులను గుర్తించి, చేపట్టాలని ఏపీఓ శివశంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 20 లక్షల పనుల లక్ష్యాన్ని ప్రభుత్వం మండలానికి ఇచ్చిందని, అధికారులు కూలీలను మరింత పెంచాలన్నారు. అలాగే ఉద్యానశాఖకు సంబంధించి మండలానికి వచ్చిన 200 ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వీరబల్లి : మండల తహసీల్దార్‌గా బుధవారం శ్రావణి నూతనంగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈమె ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. తిరిగి ఇదే మండలానికి తహసీల్దార్‌గా రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

వీరబల్లి : మండలంలోని గడికోట – వంగిమళ్ల మార్గంలోని పుల్లకూర గండి వద్ద జూదం ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. అక్కడ జూదమడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 13650లు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

గ్రామాల కన్నీటి కష్టాలు తీర్చేనా?

- రోళ్లమడుగు స్కీం నుంచి అందని నీరు
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నీటి కోసం ట్యాంకర్లను ఆశ్రయించిన సీతంపేట గ్రామస్తులు



బట్టుపల్లి గ్రామంలో ఖాళీ బిందెలు చూపుతున్న మహిళలు

వీరబల్లి : మండలంలోని గ్రామాల్లో నీటి కష్టాలు వేధిస్తున్నాయి. వీరబల్లి పంచాయతీలోని బట్టుపల్లె, తాటిగుంటపల్లె పంచాయతీలో సీతంపేటలో తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. గత రెండు వారాల నుంచి రోళ్లమడుగు స్కీమ్ నుంచి నీరు రాకపోవడంతో గ్రామాలలో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బట్టుపల్లి గ్రామంలో 50 కుటుంబాలు, సీతంపేటలో దాదాపు 300 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. బటుపల్లి వాసులు చుట్టుపక్కల మామిడి తోటల్లో రైతు బోర్ల దగ్గరకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. సీతంపేట గ్రామస్తులు సొంత ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. కాగా రెండు గ్రామాల్లో ఉన్న రెండు చేతి పంపుల్లో నీటి శాతం పూర్తిగా ఎండిపోయాయి. రోళ్లమడుగు నీరు అయినా తమ దాహార్తిని తీరుస్తాయి అనుకునేలోపు అవి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు గ్రామస్తులు తెలియజేసినా ఫలితం లేకపోయింది. గత ప్రభుత్వంలో రోళ్లమడుగుకు నీరు సక్రమంగా వచ్చేవని గ్రామస్తులు తెలుపుతున్నారు. వర్షాకాలంలోనే మా పరిస్థితి ఇలా ఉంటే రాబోయే వేసవిలో మా పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ రాలేదని వాపోతున్నారు. అధికారులు మారినా, ప్రభుత్వం మారినా నీటి కష్టాలు తీర్చలేకపోతున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నెల నుంచి నీరు రాలేదు



నెల రోజుల నుంచి మా గ్రామానికి రోళ్లమడుగు నీరు రావడంలేదు. గ్రామంలో ఉన్న బోర్లలోనూ నీటి శాతం తగ్గిపోయింది. మంచినీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నాం. గతంలో ఈ విధంగా ఎప్పుడూ లేదు. తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు ట్యాంకుల ద్వారానో, మామిడి తోటలకు వెళ్లి నీటి తెచ్చుకుంటున్నాం. మా నీటి ఎప్పుడు తీరుతాయో తెలియడం లేదు. – అచ్చమ్మ, బట్టుపల్లె, వీరబల్లి

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో మంచినీటి కోసం వారాల నుంచి ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాం. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయింది. కనీసం తాగడానికి గుక్కెడు నీరు దొరక్క మామిడి తోటల వెంబడి రైతులను అడుక్కొని నీరు తెచ్చుకునే దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి రోళ్లమడుగు నీరును అందించాలి. – వీరమ్మ, బట్టుపల్లె, వీరబల్లి

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట గురుకుల పాఠశాలలో గురువారం రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి తనిఖీ నిర్వహించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను ఆమె పరిశీలించి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు, మంచి భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని వారు ఆదేశించారు. ఏ విద్యార్థి వెనుకబడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. అర్జీలు మళ్లీమళ్లీ పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఎవరైనా రెవెన్యూ అధికారులు విధులపట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఆప్యాయంగా పలుకరిస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

9న ఉచిత అల్ట్రా సౌండ్ పరీక్షలు

నందలూరు : మండల ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత అల్ట్రా సౌండ్ ద్వారా గర్భిణులకు ఉచిత పరీక్షలు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ వైద్యాధికారి శరత్ కమల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల 9, 10వ తేదీలలో గర్భిణులకు నిర్వహించే సాధారణ పరీక్షలతోపాటు అవసరమైన వారికి అల్ట్రా సౌండ్ పరీక్షలు కూడా చేస్తామన్నారు. 9వ తేదీ రాజంపేటకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ మస్తానమ్మ గర్భిణులను పరీక్షిస్తారని, గర్భిణులు తప్పకుండా ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలకు ఓపెన్ ఇంటర్ మంజూరు

చిట్వేలి : మండల కేంద్రంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాలలో దూరవిద్యా విధానం (ఓపెన్ ఇంటర్) మంజూరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి బుధవారం తెలియజేశారు. మండల విద్యాశాఖాధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్య, స్టేట్ కో–ఆర్డినేటర్ అబ్దుల్లా, జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసరాజులతో కలిసి శ్రీసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి ఓపెన్ ఇంటర్‌కు సంబంధించిన కరపత్రాలను కళాశాలలో ఆవిష్కరించారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలలో అడ్మిషన్లు జరుగుతున్నట్లు వారు తెలియజేశారు. అడ్మిషన్లకు 9492804225, 8790198443, 8886848116 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సాగు చేసిన ప్రతి పంట నమోదవ్వాలి

సిద్దవటం : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన ప్రతి ఎకరా ఇ-పంట యాప్ నమోదు చేయాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు సిబ్బందికి తెలియజేశారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఇ-పంట జాయింట్ అజమాయిష్‌పై రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ ఇ-పంట నమోదు, డిజిటల్ క్రాప్ బుకింగ్ రెవెన్యూ, వ్యవసాయాధికారులు సమన్వయంతో సూక్ష్మ ప్రణాళికతో సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. అలాగే సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి, సహాయ గణాంకాధికారి, గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

శస్త్ర చికిత్స చేసి ప్రాణదానం చేశారు

రాయచోటి టౌన్ : ఓ నిరుపేద మహిళకు శస్త్ర చికిత్స చేసి కడుపులో ఉన్న కణతిలను తొలగించి ప్రాణదానం చేశారు రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు. బుధవారం రాయచోటి రాయచోటి ప్రాంతానికి చెందిన ఓ నిరుపేద మహిళ వైద్యం కోసం తిరుపతి, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లింది. అక్కడ చికిత్స చేసిన వైద్యులు శస్త్ర చికిత్స చేయడం చాలా ప్రమాదమని శస్త్ర చికిత్స చేయలేమని చేతులెత్తేశారు. చివరి ఆశగా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యుల దగ్గర పరీక్షించుకుంది. రాయచోటి ఏరియా ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిపుణలు డాక్టర్ లక్ష్మీప్రసాద్ స్పందించి శస్త్ర చికిత్స చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలతో ఆమె కడుపులోని 12 కణతిలను తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉంది. దీంతో ఆస్పత్రి సిబ్బంది శస్త్ర చికిత్స చేసిన వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.



శస్త్రచికిత్స చేసి కణతిలను తొలగించిన వైద్య బృందం

ఉపాధి కార్మికులకు వేతనాలు చెల్లించాలి

రైల్వేకోడూరు అర్బన్ : ఉపాధి హామీ కూలీలకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బుధవారం డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తయినా ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ బతకడానికి ఉపాధిహామీని ఎంచుకున్న ప్రతి ఒక్కరికీ వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలన్నారు. లేకుంటే నిరసనలు తెలుపుతామంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ

ఒంటిమిట్ట : ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్భయంగా నిర్వహించాలని ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ రామచంద్ర, మండల తహసీల్దార్ ఏవీ రమణమ్మ, ఎస్ఐ మధుసూదన్‌రావులు హాజరయ్యారు. ఒంటిమిట్ట మండల విద్యాశాఖాధికారి జి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిర్భయంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిటీ సభ్యులను మాత్రమే హాజరుపరచాలని, ఇతరులను అనుమతించ చేయవద్దన్నారు. ఎలాంటి సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ ఉపాధ్యాయులను కోరారు. గతంలో జరిగిన ఎన్నికల సరళిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి పెడతామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రతిష్ఠాపనోత్సవాలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో నిర్మించిన నూతన వినాయక స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ప్రారంభమయ్యాయి. 11 మంది వేదపండితుల మంత్రోచ్ఛారణలు నడుమ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. మొదటగా కలశపూజ విగ్రహ దాత రమణారెడ్డి దంపతులు వేదపండితులచే నిర్వహించారు. ఆలయం ముందుభాగాన యాగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలను అలంకరించారు. నాలుగు ద్వారాలు ఏర్పాటు చేసి ఒక్కొక్క ద్వారం వద్ద కలశాలను నిలబెట్టారు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

రాజంపేట రూరల్ : రాజంపేట తహసీల్దార్‌గా ఎస్.మహబూబ్‌చాంద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన మదనపల్లె తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన మహబూబ్‌చాంద్‌కు డీటీలు హరిత, బాషా, ఆర్ఐ కె.రాజేష్‌లు వీఆర్‌ఓలు, సిబ్బంది స్వాగతం పలికారు.

సుండుపల్లె : మండల తహసీల్దార్‌గా దైవధీనం బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా గాలివీడు తహసీల్దార్‌గా ఈయన పని చేశారు. అనంతరం విఆర్‌ఓలు తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓల సంఘం అధ్యక్షులు పెద్ద బసయ్య, రవిశంకర్, నరసింహులు, చిట్టిబాబు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల తహసీల్దార్‌గా నరసింహులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరసింహులుకు కార్యాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలున్నా సిబ్బందితో కలిసి సమన్వయంతో పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ తెలియజేశారు.

ఒంటిమిట్ట సీఐగా మోహన్ కుమార్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా (సీఐ) మోహన్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వారు బాధ్యతలు చేపట్టినట్లు సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ పురుషోత్తం రాజు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కడప వీఆర్‌లో ఉన్న మోహన్ కుమార్ ఒంటిమిట్ట సీఐగా వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని, అక్రమ ఇసుక, జూదం, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికడతామన్నారు. మోహన్ కుమార్‌కు ఒంటిమిట్ట, సిద్దవటం ఎస్ఐలు పుష్పగుచ్ఛాలు అందించారు.

గాలివీడు : మండల నూతన తహసీల్దార్‌గా జె.భాగ్యలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె కలికిరి తహసీల్దార్‌గా పని చేశారు. ఎన్నికల అనంతరం బదిలీపై గాలివీడుకు వచ్చారు. ఇందులో భాగంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలున్నా సిబ్బందితో కలసి సమన్వయంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడినందుకు అతనికి నందలూరు న్యాయమూర్తి నందిని బుధవారం ముప్పై రోజులు రిమాండ్ విధించారు. ముద్దాయిని రాజంపేట సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు.

తేలికపాటి వర్షం.. రోడ్డు జలమయం

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే రహదారి జలమయమైంది. కాలనీకి వెళ్లేందుకు మాధవరం-1 ప్రధాన రహదారి నుంచి రైల్వే తూముల మీదుగా వెళ్లాల్సి ఉంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు రైల్వే తూముల కిందికి రావడంతో రహదారి నీటిమయంగా మారింది. మోకాలి లోతు నీరు రావడంతో ప్రజలు, రైల్వే ట్రాక్ అవతల భూములు ఉన్న రైతుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గత కొన్నేళ్లుగా ఈ సమస్య ఉన్నా అధికారులు పరిష్కార మార్గం చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆర్‌యూబీ వద్ద నీళ్లు నిలిచిన దృశ్యం



ఇంటింటికి రేషన్‌ను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు వాహనాలను తొలగిస్తే దూరంగా ఉన్న రేషన్ షాపులకు వెళ్లి రేషన్ తెచ్చుకోవడం సమస్య అవుతుంది. యథావిధిగా వ్యవస్థను కొనసాగించాలి.

స్టోరుకు 4కిమీ వెళ్లాలి



నా పేరు కంబాల చరణ్. మా ఊరు సుండుపల్లె మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి. మా రేషన్ కార్డు రెడ్డివారిపల్లె స్టోర్‌లో ఉంది. మా గ్రామం నుంచి స్టోర్‌కు వెళ్లాలంటే 4 కిలోమీటర్ల దూరం వెళ్లాలి. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇంటి వద్దే రేషన్ తీసుకున్నాం. కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని తీసేస్తామని చెప్పడం దుర్మార్గం. ఇప్పుడు మళ్లీ మేము రేషన్ బియ్యం మోసుకుంటూ రావాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ముసలి, అవిటి వారి ఇబ్బందులపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అవివేకం. ప్రభుత్వం ఈ నిర్ణయం పునరాలోచించాలి. ఇంటి వద్దే రేషన్ అందించాలి.

ఇకపై పడిగాపులు కాయాల్సిందే



గత ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ అందించి నిరుపేదలకు బాసటగా నిలిచారు. ఈ రోజు అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరం. ఎందుకంటే రేషన్ స్టోర్ల వద్ద పడిగాపులు గాచి రేషన్ తీసుకునే సమయానికి టెక్నికల్ సమస్యల వల్ల ఫింగర్ ప్రింట్ మిషన్ పనిచేయట్లేదని రేషన్ డీలర్ వెనక్కి పంపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.నిరుపేదల ఉసురు కచ్చితంగా ఈ ప్రభుత్వానికి తగులుతుంది. – ఆమంచి సుబ్బరాయుడు, రేషన్ లబ్ధిదారుడు, నందలూరు

ఇంటి వద్దనే పంపిణీ చేయాలి



ఇంటి వద్దకు వచ్చి బియ్యం ఇస్తే బాగుంటాది. లేకుంటే బియ్యం కోసం కిలోమీటర్ నడిచిపోవాలి. మాబోటి వాళ్లందరూ వచ్చి ఉంటారు. అక్కడ గంటల కొద్ది ఉండాలా. కూలీ పని చేసుకొనే మేము పనులు మానుకొని బియ్యం కోసం పోతే బతికేది ఎట్లా.. అట్టాగని బియ్యం తెచ్చుకోకుంటే మా పరిస్థితి ఏంటి? మా పేదోళ్ల దేవడు జగనన్న ఇచ్చినట్లు బియ్యం ఇంటి వద్దకు తెచ్చివ్వండి సామి. మీకు పుణ్యం ఉంటాది. – ఉమ్మడి లక్ష్మీదేవి, ఎస్టీ కాలనీ, అప్పయ్యరాజుపేట, రాజంపేట

ఈ నిర్ణయంతో ఇబ్బందులే



గతంలో రేషన్ డీలర్లు అందుబాటులో ఉండే వారు కారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయడంతో మా సరుకులు మా ఇంటికి చేరేవి. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరలా చౌక దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ తెచ్చుకునే పద్ధతిని తీసుకురావడం బాధాకరం. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టుంది. – అలీ బాషా, లబ్ధిదారుడు, కోనంపేట గ్రామం, లక్కిరెడ్డిపల్లె

ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను పరిశీలించండి

లక్కిరెడ్డిపల్లి : ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను రీ-వెరిఫికేషన్ చేయాలని రాయచోటి ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన తనిఖీలు నిర్వహించి వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ 2003 సంవత్సరం అంతకుముందు అసైన్మెంట్ కమిటీలో ఇచ్చిన డీకేటీ భూములను వీఆర్‌ఓలు గ్రామాలలో రీ–వెరిఫికేషన్ చేయాలని సూచించారు. డీకేటీ భూములను ఎవరైనా అమ్మినా, కొనినా వారివద్ద నుంచి సరైన రికార్డులు ఉన్నాయా లేదా పరిశీలించి రైతు అనుభవంలో ఉంటే గ్రామంలో పంచనామా చేసి భూ హక్కుదారునికి దక్కేటట్లు చూడాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు 3431 సర్వే నెంబర్లు ఉన్నాయని, అన్ని నెంబర్లను పరిశీలించాలని, అందులో 5409 ఎకరాల భూములకు పట్టాలు అందేటట్లు చూడాలన్నారు. ప్రతి గ్రామంలో మండల, గ్రామ సర్వేయర్, వీఆర్‌ఓలు కలిసి ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను పరిశీలించాలన్నారు. అలాగే చుక్కల భూముల రికార్డులను పరిశీలించి ఆర్‌హెచ్ పేజీలో కొనుగోలుదారుడు, అమ్మిన వారి నుంచి సరైన రికార్డులు పొందారా లేదా అనేది చూడాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల వివరాల నమోదు పక్కాగా ఉండేలా సిబ్బంది చూసుకోవాలన్నారు. రైతుల సాగు అనుభవంలో ఉంటే ఎన్ని సంవత్సరాల నుంచి ఆ రైతు అనుభవంలో ఉందో పరిశీలించి నివేదికలు అందించాలన్నారు.



వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న రాయచోటి ఆర్డీఓ రంగస్వామి

సూపర్ సిక్స్ అమలెప్పుడు బాబూ?

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి : రాష్ట్ర ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాయచోటి పట్టణం బోస్‌నగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి పథకాలు అమలు చేస్తున్నట్లు వాటి మీద సుదీర్ఘంగా సమాలోచన చేస్తున్నట్లు అధికారుల కమిటీ పరిశీలిస్తున్నట్లు చెప్పుతూ కాలయాపన చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 70 వేల పెన్షన్లు రద్దు చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అధికారుల అనుమతి లేకుండా పనులు ప్రారంభం

నందలూరు : కడప–చెన్నై ప్రధాన రహదారి పక్కన నందలూరు కన్యకా చెరువు అలుగు వద్ద రూ. 40 లక్షలతో పార్కును ఏర్పాటు చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. శ్యాంప్రసాద్ ముఖర్జీ రూ అర్బన్ మిషన్ కింద నందలూరు మండలంలో పలు అభివృద్ధి పనుల కోసం రూ. 100 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 2019లో అప్పటి ఎంపీపీ మేడా పద్మజ ఆధ్వర్యంలో కన్యకా చెరువు వద్ద ఐదున్నర ఎకరాలలో పార్కు ఏర్పాటు కోసం నివేదికలు పంపడంతో జిల్లా కలెక్టర్ రూ. 40 లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ గత ఐదు సంవత్సరాల నుంచి ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు. కాగా పనులు దక్కించుకున్న గుత్తేదారుడు బుధవారం పనులు ప్రారంభించారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారి ప్రకాష్‌ను వివరణ కోరగా తమ అనుమతి ఎవరు తీసుకోలేదని, ఇరిగేషన్ అధికారులు అనుమతులు తీసుకోలేదని తెలపడం గమనార్హం.



జేసీబీతో ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం